క్లుప్తంగా

నింభాషిణి అమ్మవారి ఆలయ ప్రతిష్ట



సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు

కంచిలి: పురుషోత్తపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన నింభాషిణి అమ్మవారి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు అంగరంగ వైభవంగా బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని స్థానికులతోపాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చనను చేపట్టారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రం ఆవరణలో విద్యార్థులు

టెక్కలి: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష డివిజన్ కేంద్రమైన టెక్కలిలో బుధవారం ప్రశాతంగా పరీక్షలు జరిగాయి. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎనిమిది కేంద్రాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీఎస్ అండ్ జేఆర్, మదర్ థెరిసా, రవీంద్ర భారతి తదితర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

తీరప్రాంత భద్రతపై ప్రత్యేక నిఘా

సోంపేట: తీరప్రాంత భద్రతపై మత్స్యకారుల సహాయ సహకారాలు అవసరమని బారువ మెరైన్ సీఐ డి.వి.జె.రమేష్ కుమార్ అన్నారు. ఉప్పలాం పంచాయతీ ఎకువూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ 1093 హెల్ప్ లైన్ గురించి మత్స్యకారులకు అవగాహన కల్పించారు. తీర ప్రాంతంలో తీవ్రవాదులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పల్లెనిద్ర ప్రాధాన్యతను వివరించారు. మత్స్యకారులు సూరాడ బైరాగి, చీకటి హరినారాయణ, తోట బోగరాజు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకులు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో 167 సంఘాలు ఉన్నాయని, వాటి సంఖ్యను మూడు వందలకు పెంచేందుకు కృషి చేయాలని అన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న బొమ్మాళి శివ

పలాస: ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూలు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. యూవీవీ అధ్యక్షుడు బొమ్మాళి శివ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులకు సెలవుల్లో గణితం, స్పోకెన్ ఇంగ్లిష్ పాఠ్యాంశాల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూవీవీ గౌరవ అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, బొడ్డు చిన్నారావు, తామాడ మహేష్, పోతనపల్లి మాధవరావు, తెప్పల ఈశ్వరరావు పాల్గొన్నారు.

భోగహారతి గంట బహూకరణ



భోగహారతి గంటను ప్రారంభిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి ఆలయానికి భోగహారతి గంటను స్థానిక సూర్య మెడికల్‌స్టోర్స్ యజమాని కిల్లి సత్యానందం దంపతులు బహూకరించారు. దీన్ని బుధవారం సాయంత్రం పూజలు చేసి, దాత దంపతులు చేతులమీదుగా ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధు లు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్టాపనోత్సవాలు

కాశీబుగ్గ: దాదాపు రూ.12 కోట్ల వ్యయంతో పదేళ్లకుపైగా నిర్మిస్తూ వస్తున్న శ్రీదేవిభూదేవి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు బుధవారంతో ముగిశాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో హరిముకుంద పండా అనే వృద్ధుడు తిరుమలలో తనకు కలిగిన అసౌకర్యానికి బాధ పడి తన సొంత స్థలంలో అద్భుతమైన ఆలయం నిర్మించారు. మూడు రోజుల పాటు ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించారు. ఆలయం చూసేందుకు వచ్చినవారికి అన్నదానం, వసతి సౌకర్యం, రైలు నిలయం నుంచి ఉచిత వాహనాలు సైతం ఏర్పాటు చేశారు.

స్మార్ట్‌గా షాక్ కొడుతున్నారు..!

- స్మార్ట్ మీటర్ల వినియోగదారులకు అధిక విద్యుత్ బిల్లులు

టెక్కలి:

తాము అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచేది లేదంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీలు గుప్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పది నెలల పాలనలో అన్ని రకాల విద్యుత్ వినియోగదారులకు భారీగా విద్యుత్ బిల్లుల మోత మోగించారు. ఇదిలా ఉంటే.. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో రకంగా వాత పెడుతున్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తరువాత గతంకంటే అధికంగా లెక్కలేని అదనపు చార్జీలు మోత మోగుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొంత మేరకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్మార్ట్ మీటర్ల కంట్రోల్ ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా చేస్తున్నారు. భవిష్యత్‌లో స్మార్ట్ మీటర్లతో విద్యుత్ బిల్లుల మోత మరింత మోగనుంది.

- టెక్కలిలో ఓ బట్టల దుకాణానికి కొద్ది రోజుల క్రితం స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేశారు. మార్చి నెలలో విద్యుత్ వినియోగానికి రూ.1973 బిల్లుతో పాటు ఎఫ్‌పీపీసీఏతో పాటు మరికొన్ని ప్రత్యేక చార్జీలతో కలిపి రూ. 2,747 వచ్చింది. అంటే అదనంగా 774 రూపాయల భారం పడింది.
- టెక్కలిలోని ఓ సెల్‌పాయింట్ దుకాణానికి మార్చి నెలలో విద్యుత్ వినియోగానికి రూ. 3,422 బిల్లు వచ్చింది. దీనికి మరికొన్ని రకాల చార్జీలను కలిపి ఏకంగా రూ.4,665 బిల్లు వచ్చింది. అంటే అదనంగా 1243 రూపాయలు భారం పడింది. స్మార్ట్ మీటర్ ఏర్పాటు తరువాత అదనంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయంటూ ఆ వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



టెక్కలిలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్మార్ట్ మీటర్ల కంట్రోలర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

టెక్కలి నియోజకవర్గంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఇలా..

టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో అన్ని రకాల కలిపి సుమారు 72,652 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రస్తుతానికి 6,235 విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



టెక్కలిలోని ఓ దుకాణం వద్ద స్మార్ట్ మీటర్లు

స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీ



స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులకు నిలువునా దోపిడీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ట్రూఅప్ చార్జీలు, ఇతర సర్‌చార్జీల భారం వేసి వినియోగదారుల నడ్డి విరుస్తున్నారు. భవిష్యత్‌లో ప్రతీ ఇంటికీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్ బిల్లులు భారం వేస్తారు. ఈ స్మార్ట్ మీటర్ల వలన మీటర్స్ రీడర్స్ సైతం జీవనోపాధి కోల్పోతున్నారు. స్మార్ట్ మీటర్ల దోపిడీపై వినియోగదారులు తిరుగుబాటు చేయాలి.

–పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి

అధికంగా బిల్లు వస్తోంది..



గతం కంటే ఇప్పుడు అధికంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన తరువాత లెక్కలేని చార్జీల పేరుతో భారం వేస్తున్నారు. ప్రతీ నెల ఎంతకొంత అదనంగా భారం పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

–కె.తిరుమలరావు, స్మార్ట్ మీటర్ వినియోగదారుడు, టెక్కలి

పెంచిన బిల్లుల భారం తగ్గించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వివిధ రకాల చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులకు పెను భారం వేశారు. దీంతో పేద, సామాన్య వర్గాలతో పాటు మరికొంత మంది వినియోగదారులకు ప్రతీ నెల అదనంగా భారం పడుతోంది. తక్షణమే పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలి.

–ఎన్.షణ్ముఖరావు, ప్రజా సంఘాల నాయకుడు, టెక్కలి

సామూహిక ఉపనయనాలు



ఉపనయనాలు జరుపుకున్న యువకులు

కాశీబుగ్గ: బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పూజారివీధి రాధకాంత ఆలయంలో బుధవారం 25 మంది బ్రాహ్మణ వటువులకు చారి కర్మ పూజలు, యజ్ఞ పవిత్రధారణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒడియ బ్రాహ్మణులను సామజికంగా ఉన్నతి చేయడానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లా ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ త్యాడీ, కార్యదర్శి బాబూరావు పండా, నిత్యానంద పండా, సంతోష్ పండా, రాజేష్ పండా, ప్రదీప్ పాత్రో, పూజారి రవి, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉరసం ప్రతినిధులు

పలాస: మాకన్నపల్లి గ్రామంలో మహాకవి శ్రీశ్రీ 115వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉద్దానం రచయతల సంఘం అధ్యక్షుడు కుత్తుం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ రచయిత నిశితాసి పలు విప్లవ గీతాలను ఆలపించారు. పలువురు కవులు శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని కవితలను, స్వీయ కవితలను వినిపించారు. కార్యక్రమంలో యువకవులు గుమ్మడి సాంబమూర్తి, తెప్పల రవి, కొయిల రామలక్ష్మి, సార్ర రామారావు, అంగ ఆనందరావు, సైని మధు, కుత్తుం ప్రసాద్, పోతనపల్లి వెంకటేష్, బత్తిన విజయకుమార్, కొయిల కోటేశ్వరరావు, కుత్తుం ముకుందరావు, బొడ్డు చిన్నారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే భక్తుల మరణం



పేరాడ తిలక్

టెక్కలి:సింహాచలం అప్పన్న దేవస్థానంలో గోడ కూలిన సంఘటనలో భక్తుల మృతి కేవలం ప్రభుత్వ వైఫల్యమేనని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతీ సారీ హిందూ దేవాలయాల్లో అనేక తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం అప్పన్న దేవస్థానంలో నిజరూప దర్శనం రోజున గతంలో ఎన్నడూ లేని విధంగా సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు కావాలనే కుట్రపూరితమైన చర్యలు చేపట్టినప్పటికీ అప్పట్లో అడ్డంగా దొరికిపోయేవారని తిలక్ గుర్తు చేశారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ వైఫల్యం వలనే ఇటువంటి సంఘటన జరిగిందన్నారు.

ఏర్పాట్లలో లోపం కనిపిస్తోంది



మోహన్‌రావు

సింహాచలంలో జరిగిన సంఘటనలో ఏర్పాట్లలో పెద్ద ఎత్తున లోపం కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, న్యాయవాది సింగుపురం మోహన్‌రావు అన్నారు. ఏటా ఎంతో ఘనంగా చందనోత్సవం, నిజరూప దర్శనం నిర్వహిస్తుంటారు. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం



కవిటి: స్వామివారిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



టెక్కలి: చందన పూరిత దర్శనంలో లక్ష్మీ నృసింహస్వామి

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధర పెరుమాళ్ల స్వామికి, వివిధ గ్రామాల్లో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో బుధవారం చందనోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జిపుట్టుగలో వరాహలక్ష్మీనరసింహస్వామికి ఉన్న పాతచందనాన్ని తొలగించి కొత్తచందనాన్ని పూశారు. పాత చందనాన్ని భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. ఈ వేడుకల్లో భాగంగా బొరివంకలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టెక్కలి: అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా టెక్కలిలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తులకు చందన పూరిత దర్శనాన్ని కల్పించారు. స్వామి వారికి చందనాన్ని పూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చందన పూరితమైన స్వామిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



ఇచ్ఛాపురం: స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో ఏకైక లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో చందనోత్సవం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మెయిన్ రోడ్డులో కొలువైన స్వామివారి ఆలయంలో చందనోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా కొళిగాం, ఈదుపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ జి.యజ్ఞేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలివేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కాశీబుగ్గలో 2, 4 తేదీలో..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 2, 4 తేదీలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.యజ్ఞేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు 11 కేవీ చినబాడాం ఫీడర్ పరిధిలోని పెంటిబద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం, ఓల్డ్‌ఎన్‌హెచ్-5 రోడ్డు, తాళ్లభద్ర, నీలావురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబడం, అంతరకుడ్డ, రాజపురం గ్రామాలకు సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కంచిలి: మకరాంపురం గ్రామానికి చెందిన శివాలయం పూజారి గోవింద్‌రౌళో, లక్ష్మి దంపతుల రెండో కుమార్తె వివాహానికి కంచిలికి చెందిన ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. రూ.10 వేల నగదును ఆ పేద కుటుంబానికి బుధవారం మకరాంపురంలో రౌళో వీధిలో నివసిస్తున్న వారింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నర్తు క్రిష్ణంరాజు మాట్లాడుతూ.. ప్రతీ నెలా సహాయ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జుత్తు శ్రీనివాస్, కాలి, రంజన్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నారికి అండగా..



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దాతలు

వజ్రపుకొత్తూరు రూరల్: గడూరు గ్రామానికి చెందిన చిన్నారి జోగి యువాన్ తీవ్రమైన కంటి వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఒంకులూరు గ్రామస్తులు అండగా నిలిచారు. విరాళాలుగా రూ. 92,450 సేకరించారు. ఈ మొత్తాన్ని ఆదిబలిజ సేవా సంఘం నాయకుడు జోగి అప్పారావు సమక్షంలో చిన్నారి వైద్యం కోసం బుధవారం అందజేసి తమ ఉదారాతను చాటుకున్నారు. ఆదిబలిజ సేవా సంఘం అధ్యక్షులు చీకటి ధనుంజయ,కార్యదర్శి జోగి పురుషోత్తం, ఉపాధ్యక్షులు సి.హెచ్ వల్లభరావు, డీలర్ రాంమూర్తి, పల్లేటి నీలకంఠేశ్వరావు, జోగి అప్పారావు, లండ భోజరాజు, లండ ఈశ్వరరావు, రామస్వామి, ఎంపల్ల దుర్గారావు ఉన్నారు.

తల్లిదండ్రులకు పాద పూజ



టెక్కలి రోటరీనగర్‌లోని సత్యసాయి శాంతి సుధా మందిరంలో నిర్వహిస్తున్న ఈశ్వరాంబ వారోత్సవాల్లో భాగంగా బుధవారం బాలవికాస్ చిన్నారులతో తల్లిదండ్రులకు పాద పూజా కార్యక్రమం జరిగింది. సత్యసాయి సేవా సమితి సభ్యులు చంటి, అన్నపూర్ణమ్మ, వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రాజశేఖర్ దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస్ చిన్నారులంతా వారి తల్లిదండ్రులకు పాద పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

–టెక్కలి

పురస్కార గ్రహీతకు సత్కారం



ప్రముఖ జానపద కళాకారుడు, కందుకూరి పురస్కార గ్రహీత డాక్టర్ కుమార్‌నాయక్‌ను పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఉద్దానం రచయితల సంఘం (ఉరసం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు కుత్తుం వినోద్ మాట్లాడుతూ.. రెండు నంది అవార్డులు, జానపద విభాగంలో డాక్టరేట్, నాగాలాండ్ గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఘనత కుమార్‌నాయక్‌కే దక్కిందన్నారు. రచయితలు గుమ్మడి సాంబమూర్తి, నిశితాసి, కోయిల రామలక్ష్మి, సార్ర రామారావు, అంగ ఆనందరావు, సైని మధు, కుత్తుం ప్రసాద్, పోతనపల్లి వెంకటేశ్, బత్తిని విజయ్‌కుమార్, తెప్పల రవి, కోయిల కోటేశ్వరరావు, బొడ్డు చిన్నారావు, కుత్తుం ముకుందరావు పాల్గొన్నారు.

–పలాస

బోరు ప్రారంభం



వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బెందాళం శ్రీరాం ప్రసాద్ అన్నారు. కవిటి మండలంలోని బొరివంక పంచాయతీ బల్లెడపేట వీధిలో గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ బోరును బుధవారం ప్రారంభించారు. దీన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు సతీష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు విజయకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

–కవిటి

మూడు నెలలు నీటిపన్ను రద్దు

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి వెల్లడి



నీటి సమస్యపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ఏర్పడిన నీటి సమస్య కారణంగా మూడు నెలల పాటు నీటి పన్నును రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ప్రకటించారు. మున్సిపల్ కార్యాల యం ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. 11 అంశాలతో కూడిన ఎజెండాను సమావేశంలో చర్చించి ఆమోదించారు. ఇందులో ప్రధానంగా మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేనంతంగా ఏర్పడిన నీటి సమస్యపై కౌన్సిల్ సభ్యు లు, అధికారుల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బాహు దా నదిలో నీరు లేకపోవడంతోనే సమస్య తలెత్తిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల కు సంబంధించి నీటిపన్నును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కౌన్సిలర్లంతా నీటి సమస్య గురించే ప్రస్తావిస్తున్నారే తప్పా సమస్యను అధిగమించేందుకు అవసరమైన సలహాలు సూచించాలని చైర్‌పర్సన్ కోరారు. వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య మాట్లాడుతూ.. ట్యాంకర్ల ద్వారా చేస్తు న్న నీటి సరఫరాని ప్రణాళికాబద్ధంగా చేస్తే కొంతమేరకు సమస్యను అధిగమించవచ్చన్నారు. అలాగే బాహుదా నదిలో ఇసుకను తవ్వేయడంతోనే నీరులేకపోవడానికి ప్రధాన కారణమన్నారు. గతంలో అధికారులెవరూ పట్టించుకోక పోవడంతో ఈ సమ స్య మొదలైందని అన్నారు. వేసవిలో నీటి సమస్య దృష్టిలో పెట్టుకొని బాహుదానదిలో నిర్మించిన ఊటబావుల్లో పేరుకుపోయిన బురదను తొలగించే విషయమై ఏఈ దృష్టికి తీసుకెళ్లగా అప్పుడు వద్దన్నారని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఇటీవల కేంద్రమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వాటర్ ట్యాంకర్ల ఉన్నాయన్నారు. ఆ ట్యాంకర్లను ఉపయోగించుకొని నీటి సరఫరా చేసుకోవచ్చని సూచించారు. వాటిని నీటి సరఫరా కోసం మున్సిపాలిటీకి పంపాలని కోరగా ఇప్పుడే మో అవి రిపేర్లు అయ్యావని అన్నారు. జిల్లా అధికా రులంతా కేంద్ర మంత్రుల ముందు ఒకలా, ఇప్పుడేమో మరోలా చెప్పడం అర్థరహితంగా ఉందని చైర్‌పర్సన్ అన్నారు. ప్రైవేటు ట్యాంకర్లను అద్దెకు తీసుకొచ్చి వాటి ద్వారా నీటిని సరఫరా చేయాలంటే ఫిల్లింగ్‌కి అనువైన మరో బోరు లేకపోవడంతో ట్యాంకర్లని గంటల తరబడి ఉంచాల్సి వస్తుందని కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. రూ.5 లక్షలతో బాహుదా నదిలోని ఊటబావుల్లో బురదను తొల గించాలని, సాధారణ నిధుల ద్వారా రూ. 5 లక్షల తో ఆర్‌డబ్ల్యూఎస్ హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి మున్సిపాలిటీ హెడ్‌వాటర్ వర్క్స్‌కి పైప్‌లైన్ కలిపేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు.